## క్లుప్తంగా

### నేడు ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు: మండలంలోని అన్నవరం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డా.రాజేష్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 వరకూ నిర్వహించే వైద్య శిబిరంలో గ్రామానికి చెందిన ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకుని అవసరమైన మందులు తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు.

### ఎన్నికలప్పుడే రైతు సభలా!

ప్రొద్దుటూరు : ఎన్నికలప్పుడే రైతు సభలు గుర్తుకొస్తాయా అని రాయలసీమ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాజోలి రిజర్వాయర్ నిర్మించకపోవడంలో అన్ని పార్టీల బాధ్యత ఉందని ఆయన పేర్కొన్నారు. రైతులకు మేము న్యాయం చేశాం, కాదు మేమే చేశామంటూ సభలు పెట్టి రైతులను మోసపుచ్చుతున్నారని విమర్శించారు. కడపలో కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమ అధిక నీళ్లు దోచుకెళుతోందంటున్న తెలంగాణాలోని అన్ని పార్టీల నాయకుల ప్రచారాన్ని తిప్పికొట్టాలని పేర్కొన్నారు.

### శ్మశాన ప్రహరీ ప్రారంభం



శ్మశాన వాటిక ప్రహరీని ప్రారంభిస్తున్న సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, క్రైస్తవులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని కొత్తపల్లె పంచాయతీలోని మీనాపురం క్రైస్తవ శ్మశానవాటిక ప్రహరీని ఆదివారం కొత్తపల్లె గ్రామ పంచాయతీ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లుగా శ్మశాన వాటికకు ప్రహరీ లేకపోవడంతో క్రైస్తవులు ఇబ్బంది పడుతున్నారని, పంచాయతీ జనరల్ ఫండ్ రూ.15లక్షలో 68 సెంట్లలో ఉన్న శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో 13వ వార్డు మెంబర్ కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, ఇస్మాయిల్, సూర్యనారాయణ, పలువురు క్రైస్తవ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

### అద్వానీకి భారతరత్న ప్రకటనపై బీజేపీ హర్షం

ప్రొద్దుటూరు క్రైం : బీజేపీ అగ్రనాయకుడు, మాజీ ఉపప్రధాని ఎల్‌కే అద్వానీకి కేంద్రప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించడంపై ప్రొద్దుటూరు బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ గొర్రెశ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం శివాలయం సెంటర్లో స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి సుబ్రమణ్యం, పట్టణాధ్యక్షుడు నరేంద్రకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నాయకులు రఘురామిరెడ్డి, శరత్‌బాబు పాల్గొన్నారు.

### సీపీఎం ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ప్రొద్దుటూరు : అమృతానగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ అమృతానగర్‌లో పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చిందన్నారు. అయితే ప్రభుత్వాలు అక్కడ మౌలిక వసతులు కల్పించడంలో విఫలమయ్యాయన్నారు. కరెంటు, రోడ్లు, డ్రైనేజీ కాలువలు, తాగునీటి వసతి కల్పిలంచాలని డిమాండ్ చేశారు. పేదల స్థలాలను కబ్జా చేసి అమ్మిసొమ్ము చేసుకుంటున్న వారిపై కేసు నమోదు చేయాలని తెలిపారు. మధు, హుస్సేన్ బాషా, పార్వతి, హసీనా తదితరులు పాల్గొన్నారు.

### వైద్య శిబిరం విజయవంతం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సైదాగారి వీధిలోని మన ప్రజా సేవా సమితి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఉచిత రక్తనాళాల పరీక్షల వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో డాక్టర్లు హరిప్రకాష్, ప్రమోద రోగులకు రక్తనాళాల పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ రక్తనాళాల సమస్య ఉన్న వారికి గత పదేళ్లుగా ఏషియన్ హాస్పిటల్ ద్వారా ఉచితంగా సేవలు అందిస్తున్నామన్నారు. రాయలసీమ వాసులకు ప్రతి మంగళవారం కర్నూలులో వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు. మన ప్రజాసేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ అయూబ్ ఖాన్, గౌరవాధ్యక్షుడు మహబూబ్, ఉపాధ్యక్షులు బీటెక్ బాషా, సహాయ కార్యదర్శి మహేష్, ట్రెజరర్ మహమూద్, సభ్యులు షఫీ, రమేష్, శ్రీకాంత్, యువత అధ్యక్షులు జహీర్, యూసుఫ్, మధు, ఫరాన్, రిహాన్ పాల్గొన్నారు.

### • మాధవరాయ స్వామి విజయోత్సవం



విజయోత్సవంలో శ్రీదేవి, భూదేవి సమేత మాధవరాయస్వామి

మైదుకూరు : మైదుకూరులో వెలిసిన శ్రీలక్ష్మీ మాధవరాయస్వామి పార్వేట అనంతరం ఆదివారం విజయోత్సవాన్ని నిర్వహించారు. జనవరి 14న ప్రాంభమైన సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా మైదుకూరు పరిసరాల్లో ఉన్న 16 గ్రామాల్లో శ్రీలక్ష్మీ మాధవరాయస్వామి పార్వేట ఉత్సవాలను నిర్వహించారు. ఆదివారం మైదుకూరుకు చేరుకున్న శ్రీదేవి, భూదేవి సమేత మాధవరాయస్వామికి విజయోత్సవం పేరుతో ప్రత్యేక అలంకరణ చేసి రథంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కాయకర్పూరం సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.

### • భక్తిశ్రద్ధలతో వాసవీ హోమం

మైదుకూరు : ఈనెల 11వ తేదీన వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక అమ్మవారిశాలలో వాసవీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాసవీ మాలధారులు కుటుంబ సభ్యులతో కలిసి వాసవీ హోమం, నవగ్రహ హోమం, రుద్ర హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ మాత ఉత్సవ విగ్రహానికి పాలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వాసవి హోమం చేస్తున్న వాసవి మాలధారులు

## రాత్రి గస్తీ ముమ్మరం చేయాలి



పోలీసు అధికారులు, సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ మురళీధర్

ప్రొద్దుటూరు క్రైం : చోరీలు జరగకుండా రాత్రి గస్తీ ముమ్మరం చేయాలని ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్ తెలిపారు. సబ్‌డివిజన్‌లోని పోలీసు అధికారులతో డీఎస్పీ ఆదివారం రాత్రి సమావేశం నిర్వహించారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయా స్టేషన్ల పరిధిలో అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది రాత్రి, పగలు వారి పరిధిలో తిరుగుతూ నిఘా పెంచాలన్నారు. సమస్యాత్మక వ్యక్తులను గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని చెప్పారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాల వినియోగం, వాటి ఉపయోగం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు శ్రీకాంత్, ఇబ్రహీం, వెంకటరమణ, యుగంధర్, రమణారెడ్డి, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు దిక్సూచి కెరీర్ గైడెన్స్



కెరీర్ గైడెన్స్ పుస్తకాలను విద్యార్థినీలకు పంపిణీ చేసిన దృశ్యం

కలసపాడు : పదవ తరగతి విద్యార్థుల భవిష్యత్తుకు కెరీర్ గైడెన్స్ పుస్తకం దిక్సూచి లాగా ఉపయోగపడుతుందని వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పెండ్లిమర్రి గ్రామం వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పూర్తయిన తర్వాత విద్యార్థులు ఎలాంటి కోర్సుల్లో చేరాలి, ఎలాంటి విద్య, ఉద్యోగ అవకాశాలు ఉంటాయి అనే అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు తమ ఆసక్తితో పాటు సామర్థ్యాన్ని గుర్తెరిగి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మార్గ నిర్దేశనంలో కోర్సులు ఎంచుకుంటే భవిష్యత్తు బంగారు బాట అవుతుందని సూచించారు. విద్యార్థి దశ చాలా ముఖ్యమైనదని, సమయాన్ని వృథా చేసుకోకుండా శ్రద్ధగా చదువుకోవాలని తెలిపారు. ప్రణాళిక బద్ధంగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. అనంతరం పదవ తరగతి చదువుతున్న 37 మంది విద్యార్థినీలకు కెరీర్ గైడెన్స్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు కె.ప్రభావతి, విద్యార్థినీలు పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ



గోపవరంలో ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న డీడీఓ విజయకుమార్

గోపవరం : మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఆరోగ్యశ్రీ కార్డులను ఆదివారం పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 6 సచివాలయాల పరిధిలో 5211 ఆరోగ్యశ్రీ కార్డులు రాగా ఇప్పటివరకు 137 కార్డులు పంపిణీ చేశారు. ఒకటి, రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో పంపిణీ చేయనున్నారు. అలాగే జగనన్న ఇళ్లకు సంబంధించి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని కూడా ముమ్మరం చేశారు. సెలవు దినం ఆదివారం అయినప్పటికీ పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు లబ్ధిదారులతో మాట్లాడి ఆయా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేపట్టారు. డీడీఓలు విజయకుమార్, వెంకటసుబ్బయ్య, మోశ, శ్రీనివాసులరెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

### గాయకులకు సత్కారం

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన గాయకుల కృషిని గుర్తించి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా వారిని సత్కరించారు. స్థానిక నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో మహమ్మద్ రఫీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక గాయకులు నయీమ్‌తోపాటు అస్గర్ హుసేన్, హుమయూన్‌బాషా, మహబూబ్‌బాషాలు మహమ్మద్ రఫీ ఆలపించిన సినీ గీతాలను పాడి అందరినీ అలరించారు. అనంతరం పలు సంవత్సరాలుగా స్థానిక గాయకులు చేస్తున్న కృషిని అభినందిస్తూ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా వారిని శాలువతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

### ఎన్నికల బరిలో ప్రజా సోషలిస్ట్ కూటమి

కడప కోటిరెడ్డిసర్కిల్: రానున్న ఎన్నికల్లో ప్రజా సోషలిస్టు కూటమి పోటీలో ఉంటుందని కూటమి రాష్ట్ర కన్వీనర్ బీసీ రమణ తెలిపారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ప్రజా సోషలిస్ట్ కూటమి రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలే అజెండాగా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజా సోషలిస్టు కూటమి రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల బరిలో దిగుతుందన్నారు. కడప పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నానన్నారు.

## రైతులపై వరద కపట ప్రేమ

ప్రొద్దుటూరు : రైతులపై మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కపట ప్రేమ చూపిస్తున్నారని రాయలసీమ పోలీసు కంప్లెయింట్ అథారిటీ మెంబర్ కాకర్ల నాగేశ్వారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాయలసీమకు గత టీడీపీ ప్రభుత్వంలో తీరని అన్యాయం జరిగినా, ఆనాడు ఆయన ఒక్క మాట మాట్లాడలేదని పేర్కొన్నారు. రైతు వేషం వేసిన వరదరాజులరెడ్డి రాజుపాళెం మండలం వెల్లాలో రైతు సదస్సు ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కృష్ణాజలాల్లో రాయలసీమకు నికర జలాల విషయంలో టీడీపీ తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. ఇటీవల కృష్ణాజలాల గురించి స్పష్టత ఇవ్వలేదని, పోలవరం, పట్టిసీమతోనే రాయలసీమకు మేలు జరుగుతుందని నమ్మబలికారని పేర్కొన్నారు. వరదరాజులరెడ్డి రైతుల కోసం అంటూ పెట్టిన సదస్సు వెనుక రాజకీయ ప్రయోజనాలు తప్ప రైతులకు ఆయన చేసే మేలు ఏమైనా ఉందా? ఇప్పటిదాకా చేసింది ఒక్కటైనా ఉందా అని ప్రశ్నించారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి బీమా కోసం పోరాటం చేసి ఇప్పించారన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి వ్యవసాయ పనుల కోసం రూ.కోట్లు విలువైన ట్రాక్టర్లను ఇచ్చారని గుర్తు చేశారు.

## కబడ్డీ, వాలీబాల్ రన్నర్స్‌గా మండల జట్లు



ఆడుదాం ఆంధ్రా పోటీలలో వాలీబాల్‌లో రన్నర్స్‌గా నిలిచిన లక్ష్మీపేట బాలికలు



ఆడుదాం ఆంధ్రా పోటీలలో కబడ్డీ లో రన్నర్స్‌గా నిలిచిన చియ్యపాడు బాలుర జట్టు

చాపాడు : ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి క్రీడా పోటీలలో మండలంలోని చియ్యపాడు, లక్ష్మీపేట గ్రామాలకు చెందిన జట్లు రన్నర్స్‌గా నిలిచినట్లు మండల అభివృద్ధి అధికారి పి.మహబూబ్ బీ తెలిపారు. కబడ్డీలో చియ్యపాడు గ్రామానికి చెందిన బాలుర జట్టు, వాలీబాల్‌లో లక్ష్మీపేట గ్రామానికి చెందిన మహిళల జట్టు జిల్లా స్థాయిలో జరిగిన ఆడుదాం ఆంధ్రా పోటీలలో రన్నర్స్‌గా నిలిచాయి. తమ మండలానికి చెందిన పురుషుల, బాలికల జట్లు జిల్లా స్థాయిలో రన్నర్స్ నిలువటంపై పంచాయతీ కార్యదర్శి సుధాకర్, మండల అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

## శున'కాలు' పట్టేస్తున్నాయ్



నెల్లూరు రోడ్డులో అధికంగా సంచరిస్తున్న కుక్కలు

బద్వేలు అర్బన్ : పట్టణంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వివిధ వీధులతో పాటు ప్రధాన రహదారుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. ఇటీవల పట్టణంలోని రాజుగారివీధి, అమ్మవారిశాలవీధి, కొండారెడ్డివీధిలలో కుక్కలు ప్రజలపై దాడులు చేశాయి. దీంతో ప్రజలు బయటికి రావాలంటేనే బెంబేలెత్తుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో అయితే ఒంటరిగా వెళ్లేందుకు జంకుతున్నారు. ప్రధానంగా సిద్దవటం రోడ్డులోని చికెన్ షాపుల వద్ద కుక్కల సంచారం అధికంగా ఉంటోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కలను నియంత్రించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

## చియ్యపాడులో ట్యాంకర్లతో మంచినీరు సరఫరా



చియ్యపాడు గ్రామంలో ట్యాంకర్ నుంచి మంచినీటిని తీసుకుంటున్న మహిళలు

చాపాడు: మండల పరిధిలోని చియ్యపాడులో కొన్ని రోజులుగా మంచినీటి ఎద్దడి ఏర్పడటంతో ఆదివారం సర్పంచ్ ఓబులేసు, పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌లు ట్యాంకర్లతో మంచినీటిని గ్రామ ప్రజలకు సరఫరా చేశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భూగర్భజలాలు అడుగంటి పోవటంతో చియ్యపాడు గ్రామంలో గత కొన్ని రోజులు మంచినీటి సమస్య నెలకొంది. త్వరలోనే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకోవటం జరుగుతుందని సర్పంచ్ తెలియజేశారు.

## 6న ప్రజ్ఞా వికాసం పరీక్ష



పరీక్ష కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 6న మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాస్ నమూనా పరీక్ష నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డేవిడ్ రాజ్, జిల్లా అధ్యక్షుడు రాహుల్ తెలిపారు. స్థానిక జీవన్‌జ్యోతి హైస్కూల్‌లో కరస్పాండెంట్ అమర్‌నాథ్‌రెడ్డితో పాటు వారు పరీక్ష కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పరీక్ష పేపర్‌ను ప్రముఖ విద్యావేత్త కేఎస్ లక్ష్మణరావు తయారు చేస్తారని, పరీక్ష 100 మార్కులకు ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఉంటుందన్నారు. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు మండల స్థాయిలో మొదటి మూడు బహుమతులు అందిస్తామన్నారు. వివరాలకు 9502494474 సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిరణ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సమస్యల పరిష్కారానికి చట్టాలు



మాట్లాడుతున్న సైకాలజిస్టు పీపీ సునీత

కడప కల్చరల్ : మహిళల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పలు చట్టాలను రూపొందించిందని, వాటిపై అవగాహన కలిగి ఉండి స్వీయ రక్షణతోపాటు సాటి మహిళల రక్షణ కోసం కృషి చేయాలని ప్రముఖ సైకాలజిస్టు పీపీ సునీత అన్నారు. ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (అవోపా) మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలో మహిళా సాధికారత–రక్షణ–అవగాహనపై ఆమె మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో మహిళలు ఎదుర్కొనే సమస్యలు, మహిళా భక్తులు, వారికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం రూపొందించిన చట్టాలు, వాటి ద్వారా మహిళా సమస్యల పరిష్కారంపై వివరించారు. ప్రభుత్వం రూపొందించిన దిశ యాప్ గురించి కూడా సోదాహరణంగా వివరించారు. ప్రధాని మోడీ మహిళల కోసం తెచ్చిన చట్టాలపై తెలియజేశారు. అనంతరం నిర్వాహకులు ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు మునగా శ్రీనివాస్, యాదాళ్ల రమణ, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షులు వంకదారి విజయ, మహిళా మండలి అధ్యక్షులు చెప్పరపు నాగ పుష్పాంజలి, కార్యదర్శి దశమందం వెంకట సుప్రియ, కోశాధికారి దరిశా నాగ సునీత, అవోపా జిల్లా అధ్యక్షులు ఆకుల సత్యప్రసాద్, కార్యదర్శి కృష్ణం శివ, కోశాధికారి వంకదారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశాజనకంగా పంటలు

ఖరీఫ్ సీజన్‌లో మినుము, పెసర, మొక్కజొన్న తదితర పంటల నూర్పిళ్ల అనంతరం రెండో పంటలుగా సాగు చేసిన నువ్వులు, కొర్ర, కుసుమ, ఆవాలు, ఉలవ, వరి, మొక్కజొన్న పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. కాలువల్లో వస్తున్న నీటితోనే ఈ పంటలను సాగు చేశామని రైతులు తెలిపారు. సాగు చేసిన పంటల ధరలు కూడా బాగుండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. దిగుబడులు బాగా రావాలని కోటి ఆశలతో పంటలను సాగు చేసినట్లు రైతులు పేర్కొన్నారు.


– రాజుపాళెం



రాజుపాళెంలో సాగులో ఉన్న కుసుమ పంట



పగిడాలలో సాగులో ఉన్న ఆవాల పంట



వెంగళాయపల్లెలో సాగులో ఉన్న ఉలవ పంట



సాగులో ఉన్న కొర్ర పంట

### గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలేటిపల్లె–కొత్తపేట సమీపంలో వెలసిన గంగమ్మతల్లికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలతోపాటు పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు సౌకర్యాలను ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఈవో పి.సురేష్‌కుమార్‌రెడ్డి కల్పించారు.

### 12వ పీఆర్‌సీ అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 12వ పీఆర్‌సీని అమలు చేయాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని సీఎస్ఐ హైస్కూల్‌లో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా కౌన్సిల్ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 12వ వేతన సంఘం కమిషన్‌ను ఏర్పాటు చేసి ఆరు నెలలైనా.. ఇంత వరకు బాధ్యతలు చేపట్టలేదన్నారు. త్వరగా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని, వెంటనే ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘాలతో చర్చించి 30 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీని ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ ముత్యాలప్ప, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## దళిత హక్కుల కోసం పోరాటం చేయాలి



డైరీ ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, డీహెచ్‌పీఎస్ నాయకులు

కడప వైఎస్సార్ సర్కిల్ : దళితుల హక్కుల కోసం పోరాటాలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో డీహెచ్‌పీఎస్ 2024 రాష్ట్ర డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల హక్కుల కోసం పోరాడటం అంటే ఎంతో సాహసోపేతమైన కార్యక్రమమని, అటువంటి డైరీని ఆవిష్కరిస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆనాడు రాజ్యాంగంలో అంబేడ్కర్ దళితుల కోసం పొందుపరచిన చట్టాలను అమలు చేయవలసిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, చట్టసభలు, పోలీసు,న్యాయ వ్యవస్థపై ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత, మైనార్టీ వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దాడులు పెరిగిపోయాయన్నారు. మతం ప్రాతిపదికన మెజార్టీలు సంతృప్తి చెందడానికి.. అన్నదమ్ముల్లా కలిసి ఉన్న భారత దేశ ప్రజలను విడదీస్తూ పరిపాలన సాగించడం సిగ్గుచేటు అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలలుగన్న భారతదేశం కాకుండా నేడు పూర్తిగా మనువాదుల చేతులలోకి వెళ్లిందన్నారు. తద్వారా దేశంలో దళితుల పైన దాడులు, కుల వివక్షత పెరిగి పోయాయన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్, సీపీఐ జిల్లా నాయకులు కె.సి.బాదుల్లా, కానగల మునెయ్య, నగర అధ్యక్షుడు గోవిందు, తారక రామారావు, నరసింహులు, రాజశేఖర్, ఈశ్వరయ్య, జాన్, వెంకటాద్రి, బాబు, విజయ్ పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కడప కల్చరల్ : నేటి యువత దుర్వసనాల వైపు త్వరగా ఆకర్షితులవుతున్నారని, ముఖ్యంగా వారు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని దైవ జనులు పాస్టర్ మహేష్, సిస్టర్ శాంతమ్మ పేర్కొన్నారు. ఆదివారం వారు న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ చర్చిలో ప్రపంచ శాంతి కోసం ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలంతా శాంతియుతంగా జీవించాలని, దైవం వారి పట్ల కృప చూపాలని కోరారు. ప్రజలు ఆధ్యాత్మికంగా ఎదుగుతూ, ఐకమత్యంగా జీవించాలని, యువత చెడు వ్యసనాలకు దూరమై కుటుంబంతో పాటు దేశ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.